21092024-MAI-08_Layout 1 9/21/2024 2:10 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

ఇంటర్మీడియట్ ఎత్తివేత అవివేకపు చర్య

నూతన విద్యా విధానం తెరమీదకుతెచ్చిన 5+3+3+4 పద్ధతిని పాఠశాల విద్యలో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందా? నూతన విద్యా విధానం సిఫారసులతో విద్యారంగం గట్టెక్కే అవకాశం ఉన్నదా? విద్య ఉమ్మడి జాబితాలో ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నూతన విద్యా విధానంపై చర్చించి, నిర్ణయం తీసుకోకుండా కేంద్రం ఒత్తిడితో ఇంటర్ తరగతులు రద్దు చేయనున్నదా? ఒకవేళ అదే నిజమైతే రాష్ట్ర విద్యా కమిషన్‌ను ఏర్పాటుచేసి విద్యా విధానంపై సూచన చేయాలని రాష్ట్రం ప్రభుత్వం ఎందుకు కోరినట్టు? రాష్ట్ర ప్రభుత్వ చర్యల వల్ల ఇలాంటి అనేక అనుమానాలు కలుగుతున్నాయి.

కె.వేణుగోపాల్
98665 14577

రాష్ట్రంలో ఏటా సుమారు 5 లక్షల మంది విద్యార్థులు పదో తరగతి పాసవుతున్నారు. వీరిలో లక్ష మందికి పైగా ఇంటర్‌తోనే విద్యను ఆపేస్తున్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో కలిపి 3,287 జూనియర్ కాలేజీలున్నాయి. వీటిలో ప్రైవేట్ కాలేజీలు 1,482 కాగా, ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, గురుకులాలు, కేజీబీవీలు కలిపి మొత్తం 1,805 కాలేజీలు ప్రభుత్వ రంగంలో ఉన్నాయి. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో 9, 10వ తరగతుల్లో 94 శాతంగా ఉండగా, ఇంటర్‌కు వచ్చేసరికి 76 శాతంగా ఉన్నది.

నూతన విద్యా విధానం ప్రకారం.. జూనియర్ కళాశాలలు, ఇంటర్మీడియట్ తరగతులు రద్దయిపోయి, అంగన్‌వాడీలో ప్రాథమిక తరగతులను కలిపేస్తే విద్యారంగం స్వరూపమే మారిపోతుంది. ఇప్పుడున్న అంగన్‌వాడీ, పూర్వ ప్రాథమిక విద్య, ప్రాథమిక విద్య కలిసిపోతాయి. 9 , 10వ తరగతులతో కలిపి ఇంటర్మీడియట్ అంటే 11 - 12 తరగతులను కూడా పాఠశాల స్థాయిలోనే నిర్వహించే పద్ధతి వస్తుంది. ప్రస్తుత పాఠశాల విద్యా విధానం కొఠారి కమిషన్ 1966లో చేసిన సిఫారసుల మేరకు నడుస్తున్నది. దీని ప్రకారం.. సెకండరీ విద్య, ఇంటర్మీడియట్, ఆ తర్వాత డిగ్రీ.. ఇలా ఒక క్రమ పద్ధతి ప్రకారం ఉన్నది. ఈ విధానంలో పాఠశాల విద్య పదవ తరగతికే పరిమితమైపోతుంది. జూనియర్ కళాశాలల పేరుతో ఇంటర్మీడియట్ విద్య 11 ,12వ తరగతుల వరకు ఉంటుంది.

కొత్త విధానంలో పూర్వ ప్రాథమిక విద్య (ప్రీ ప్రైమరీ), ప్రాథమిక విద్య (3-8), సెకండరీ విద్య (9-12)పేరుతో మూడు విభాగాలుగా విద్యా విధానం ఉండబోతున్నది. ఇది అమల్లోకి వస్తే సుమారు ఐదున్నర దశాబ్దాలుగా ఉన్న జూనియర్ కళాశాల వ్యవస్థ, ఇంటర్మీడియట్ బోర్డు రద్దయి పాఠశాల విద్యలో విలీనమవుతాయి. ఎస్ఎస్‌సీ పరీక్షలు రద్దయి, 12వ తరగతిలో టర్మినల్ ఎగ్జామినేషన్ ఉంటుంది. ఎస్ఎస్‌సీ బోర్డు కూడా రద్దవుతుంది.

ఇదంతా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానం- 2020 సిఫారసుల మేరకే జరగబోతోంది. రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యా విధానం సిఫారసులను పూర్తిగా ఆమోదించిందా? ఆమోదించచే ముందు అవసరమైన చర్చలు జరిపిందా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. విద్యా విధానాన్ని సమగ్రంగా పరిశీలించి, చర్చించి, ఒక సమగ్ర విధానాన్ని సూచించాలని విద్యా కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం రెండు వారాల కిందట నియమించింది. ఆ కమిషన్ పని ప్రారంభించకుండానే, కమిషన్‌లో ఉండే ముగ్గురు సభ్యుల నియామకం జరగకుండానే కొత్త మార్పులను తీసుకొచ్చే ప్రయత్నాలు చేయడం ఏమిటి? ఈ విధానంతో ఇంటర్మీడియట్ స్థాయిలో డ్రాపౌట్ సమస్య ఎంత మాత్రం సమసిపోదు. పైగా బోధన, విద్యా ప్రమాణాలు మరింత క్షీణించే ప్రమాదం ఉంది. ఉపాధ్యాయుల నియామకాల్లో కూడా నాణ్యత తగ్గడం, విద్యార్థుల మానసిక పరిస్థితిని బట్టి బోధన జరగాల్సిన ప్రక్రియకు ప్రాధాన్యం లేకుండా పోతుంది.

> విద్యా విధానాన్ని సమగ్రంగా పరిశీలించి, చర్చించి, ఒక సమగ్ర విధానాన్ని సూచించాలని ఒక విద్యా కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం రెండు వారాల కిందట నియమించింది. ఆ కమిషన్ పని ప్రారంభించకుండానే, కమిషన్‌లో ఉండే ముగ్గురు సభ్యుల నియామకం జరగకుండానే కొత్త మార్పులను తీసుకొచ్చే ప్రయత్నాలు చేయడం ఏమిటనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి.

> నూతన విద్యా విధానంపై విద్యావేత్తలు, ప్రొఫెసర్లు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో నూతన విద్యా విధానంపై పార్లమెంటులో చర్చించకుండా, ఆమోదించకుండానే దాన్ని అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం హడావుడి చేస్తున్నది. ఇది రాష్ట్రాల హక్కులను హరిస్తూ, కేంద్రీకరణ దిశగా అడుగులు వేయడమే. విద్య ఉమ్మడి జాబితాలో ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించకుండా కేంద్ర ప్రభుత్వం అమలుకు పూనుకోవడం ఫెడరల్ స్వభావానికి విఘాతం కలిగించడమే. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్చించకుండానే విద్యారంగంలో కేంద్రం పెత్తనాన్ని ఎట్లా అంగీకరిస్తున్నది?

విద్యారంగంలో రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను ఈ విధానం నిరాకరిస్తున్నది. దాని స్థానంలో ప్రతిభ అనే భావనను నూతన విద్యా విధానం ముందుకుతెస్తోంది. పాఠశాలలను మూసివేస్తూ, స్కూల్ కాంప్లెక్స్‌ల ఏర్పాటు, ఏకోపాధ్యాయ పాఠశాలలు, ఇంటి నుంచే విద్య, డిజిటల్ విద్య, ఓపెన్ స్కూల్ వంటి ప్రత్యామ్నాయ విధానాలను ప్రోత్సహిస్తున్నది. ఈ క్రమంలో పేదలు, వెనుకబడిన వర్గాలకు రాజ్యాంగం కల్పిస్తున్న సమానత్వ హక్కును ఉల్లంఘిస్తోంది. నూతన విద్యా విధానంలో అందరికీ ఉచిత నిర్బంధ విద్య ప్రస్తావన లేకపోవడం ప్రాథమిక విద్యా హక్కు ఉల్లంఘన అవుతుంది. పాఠ్యాంశాల తొలగింపు, కేంద్ర ప్రభుత్వ భావజాలానికి అనుగుణంగా సిలబస్ రూపకల్పన, మళ్లీ ప్రాచీన వృత్తులకు సంబంధించిన వృత్తి విద్యలు ప్రవేశపెట్టడం వంటి ఏకపక్ష విధానాలకు కేంద్రం ఊతమిస్తున్నది. పూర్వ ప్రాథమిక విద్యను ప్రాథమిక విద్యకు అనుసంధానం చేయాలనే సిఫారసు చేసినప్పటికీ ఉపాధ్యాయుల శిక్షణ, నియామకాల గురించిన ప్రస్తావన లేదు. దీని వల్ల పూర్వ ప్రాథమిక విద్యలోకి మార్కెట్ శక్తులు ప్రవేశించే అవకాశం ఉంది. రెగ్యులర్ పోస్టుల్లో ఉపాధ్యాయుల నియామకాలను నూతన విద్యా విధానం నిరాకరిస్తుంది. కాంట్రాక్టు టీచర్లను రెగ్యులర్ చేసే ప్రస్తావన నూతన విద్యా విధానంలో లేదు. పైగా ఉపాధ్యాయులకు సీనియారిటీ ప్రకారం పదోన్నతుల ద్వారా కాకుండా, ప్రతిభ పేరుతో పదోన్నతులకు అవకాశం కల్పిస్తుంది. అక్రిడియేషన్ పద్ధతి ద్వారా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను నిర్వీర్యం చేయడంతో పాటు ప్రైవేట్ రంగంలో విశ్వవిద్యాలయాల ఏర్పాటుతో విద్యా వ్యాపారీకరణను మరింత పెంచుతుంది. స్కాలర్‌షిప్ విధానానికి తిలోదకాలు ఇచ్చి, విద్యా రుణాల ద్వారా విద్యార్థులను, తల్లిదండ్రులను అప్పుల ఊబిలోకి నెడుతుంది. విద్యారంగంపై వినియోగించే బడ్జెట్‌ను వృథా ఖర్చుగా భావిస్తూ నిధుల కొరత సాకుతో విద్యారంగం ప్రైవేటీకరణను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నది. విద్య, ఉపాధి అంశాలపై ఉన్నత వర్గాల ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి నూతన విద్యా విధానం దోహదం చేస్తున్నది.

> 55 ఏండ్లుగా రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్య కీలక పాత్ర పోషిస్తూ, ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నది. విద్యార్థులను మెరికల్లా తీర్చిదిద్దుతున్నది. అంతేకాదు, వైద్య, ఇంజినీరింగ్ లాంటి వృత్తి విద్య కోర్సుల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నది. మన సిలబస్‌కు ఆకర్షితులై వివిధ రాష్ట్రాల విద్యార్థులు కూడా ఇక్కడికి వచ్చి చదువుకుంటున్నారు. వారి భవిష్యత్తుకు బాటలు వేసుకుంటున్నారు.

ఈ నేపథ్యంలో ప్రతి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రారంభించి, ఇంటర్మీడియట్ విద్యను పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉన్నది. అన్ని సబ్జెక్టుల అధ్యాపకులను నియమించాలి. తద్వారా తల్లిదండ్రులు, విద్యార్థుల్లో విశ్వాసం కల్పించాలి. ఆ బాధ్యతను వదిలి, కార్పొరేట్ సంస్థల ఒత్తిళ్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లొంగిపోవడం విచారకరం. ఇంటర్మీడియట్ బోర్డును అదుపు చేయకుండా, మొత్తం ఇంటర్మీడియట్ కోర్సునే రద్దు చేస్తామనడం అవివేకమే.

నాణ్యమైన, నైపుణ్యం కలిగిన విద్యార్థులను తయారు చేసే క్రమంలో రాజీపడకుండా విద్యా సంస్థలను నిర్వహించాలి. విద్యా కమిషన్‌కు ఆ బాధ్యత అప్పగించాలి. తద్వారా రాష్ట్రంలో పటిష్ఠమైన విద్యా విధానాన్ని రూపొందించి, ఇంటర్మీడియట్ విద్యను కాపాడాలి.

(వ్యాసకర్త: పూర్వ అధ్యక్షులు, ఏపీటీఎఫ్)

రాజీనామా వ్యూహం ఫలించేనా?

ప్రజా న్యాయస్థానంలో తీర్పు కోరుతూ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ వ్యూహం ఫలిస్తుందా? అనేది ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్న అంశం. ఢిల్లీ మద్యం విధానంలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలకు సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థలు పెట్టిన కేసుల కారణంగా రెండు దఫాలుగా జైలులో ఉన్న కేజ్రీవాల్ తాజాగా బెయిలుపై విడుదలైన విషయం విదితమే. జైలు నుంచి బయటికి వచ్చిన వెంటనే తాను ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తున్నానని, వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగాల్సిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను మహారాష్ట్రతో కలిపి నిర్వహించాలని ప్రకటించి తీవ్ర సంచలనం సృష్టించారు. రానున్న ఎన్నికల్లో ఆప్‌ను మరోసారి గెలిపిస్తేనే తాను తిరిగి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతానని ఆయన చెప్పడం రాజకీయ సాహసమే గాక, ఢిల్లీ ఓటర్లపై ఆయనకున్న నమ్మకానికి చిహ్నంగా భావించవచ్చు.

నాంచారయ్య మెరుగుమాల

ఆప్ ప్రభుత్వంలో కీలక శాఖల మంత్రిగా పనిచేసిన ఆతిశీ మార్లెనా సీఎం పదవి చేపట్టాక జరగనున్న ఢిల్లీ ఎన్నికల్లో ఆప్‌కు ఎక్కువ విజయావకాశాలున్నాయని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు. నాలుగు నెలల క్రితం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఢిల్లీలోని మొత్తం ఏడు స్థానాలనూ బీజేపీ కైవసం చేసుకున్నది. అయినప్పటికీ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటమి తప్పదని ఎన్నికల పరిశీలకులు భావిస్తున్నారు. 2011లో కాంగ్రెస్ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి, షీలా దీక్షిత్ నాయకత్వాన నడుస్తున్న ఢిల్లీ కాంగ్రెస్ సర్కారు అవినీతికి వ్యతిరేకంగా ఉవ్వెత్తున లేచిన ప్రజా ఆందోళనల నుంచి అవతరించిన అరవింద్ కేజ్రీవాల్ అనతికాలంలోనే సమర్థ నేతగా ఎదిగారు.

2012లో ఆప్‌ను స్థాపించిన తర్వాత అనతికాలంలోనే ఆయన ఓటర్లను ఆకట్టుకున్నారు. ఏడాది తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 70 సీట్లలో ఆప్ 28 స్థానాలు గెలిచి, రెండో పెద్ద పార్టీగా అవరించింది. బీజేపీని అధికారంలోకి రాకుండా నిరోధించే లక్ష్యంతో 8 మంది కాంగ్రెస్ సభ్యులు ఇచ్చిన మద్దతుతో కేజ్రీవాల్ 2013 డిసెంబర్ 28న తొలిసారి ఢిల్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. అయితే, లోక్‌పాల్ బిల్లుతో పాటు అనేక కీలక అంశాల్లో కాంగ్రెస్ వైఖరికి నిరసనగా 2014 ఫిబ్రవరిలో రాజీనామా చేశారు. అయితే మొహల్లా క్లినిక్‌లు, విద్యా విధానంలో మార్పులు, విద్యుత్తు చార్జీల తగ్గింపు వంటి జనాకర్షక విధానాలతో ఢిల్లీ ప్రజలకు ఆప్ తక్కువ సమయంలోనే మరింత దగ్గరైంది. అయితే, కొన్ని వారాల తర్వాత జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో యూపీఏ ప్రభుత్వానికి నాయకత్వం వహించిన కాంగ్రెస్‌ను కొనసాగించడమా, లేక గద్దె దించడమా? అనేదే ప్రధాన ఎజెండాగా ఎన్నికలు జరిగాయి. ఈ నేపథ్యంలో ఆప్ ఢిల్లీలోని అన్ని సీట్లలో ఓడిపోయింది.

ఆ తర్వాత 2015లో జరిగిన ఎన్నికల్లో కేజ్రీవాల్ పార్టీ ఎవ్వరూ ఊహించినంతటి భారీ మెజారిటీని సాధించింది. మొత్తం 70 స్థానాల్లో ఆప్‌కు 67 సీట్లు రాగా, బీజేపీ మూడు స్థానాలే దక్కించుకుంది.

> 1998-2013 మధ్య 15 సంవత్సరాలు ఢిల్లీని నిరాటంకంగా పరిపాలించిన కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోయింది. 2013 ఎన్నికల్లో 8 సీట్లు దక్కించుకున్న కాంగ్రెస్ 2015 ఎన్నికల్లో ఖాతా కూడా తెరవలేదు. తన జనాకర్షక, ప్రజాసంక్షేమ విధానాల ద్వారా అరవింద్ కేజ్రీవాల్ ప్రజలను సంతృప్తి పరచడంలో విజయం సాధించారు.

ఈ నేపథ్యంలో అడుగడుగునా ఆప్ సర్కారును కేంద్ర ప్రభుత్వం ఇబ్బందులు పెట్టినా కేజ్రీవాల్ తలవంచలేదు. కానీ, బీజేపీ రామబాణానికి పోటీగా హనుమాన్ చాలీసా పఠనం వంటి కొత్త ఆయుధాలతో కాషాయపక్షంతో తలపడ్డారు. ముస్లింల మద్దతు పొందుతూనే హిందూత్వ విషయంలో అవసరమైన మేరకు స్వల్ప స్థాయిలో ఆయన రాజీపడ్డారనే పేరు తెచ్చుకున్నారు. మొదటిసారి ఆప్ నాలుగేండ్ల జనరంజక పరిపాలన తర్వాత 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అంతకు ముందు పార్లమెంటు ఎన్నికల్లో మాదిరిగానే ఆప్ ఒక్క సీటూ కైవసం చేసుకోలేకపోయింది. అప్పుడు కేంద్రంలో పాలకపక్షమైన బీజేపీకి ఢిల్లీ ఓటర్లు అనుకూలంగా ఉండటం ఆప్ పరాజయానికి దారితీసింది. ఈ ఎన్నికలైన దాదాపు ఏడాది తర్వాత 2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అతి స్వల్ప సంఖ్యలో సీట్లు తగ్గినా ఆప్ మరోసారి తిరుగులేని మెజారిటీ సాధించింది. మొత్తం 70 సీట్లలో 62 స్థానాలు దక్కించుకున్నది. బీజేపీ బలం 3 నుంచి 8కి పెరిగింది. కాంగ్రెస్ వరుసగా రెండోసారి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఖాతా తెరవకుండా కొత్త రికార్డు నమోదు చేసింది. ఇక్కడ ఆసక్తికరమైన అంశం ఏమంటే.. ఆప్ వరుసగా రెండు అసెంబ్లీ ఎన్నికల్లో (2015, 2020) 85 శాతానికి పైగా సీట్లు (67, 62) కైవసం చేసుకోవడంతో పాటు వరుసగా 54.3 శాతం, 53.57 శాతం ఓట్లు సంపాదించడం విశేషం.

రెండు అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీకి 40 శాతం లోపు, కాంగ్రెస్‌కు 10 శాతం కంటే తక్కువ ఓట్లు రావడం ఏండ్లతేండ్లు ఢిల్లీని పాలించిన ఆ పార్టీలకు జనామోదం లేదని నిరూపించింది. వరుసగా మూడు పార్లమెంటు ఎన్నికల్లో (2014, 2019, 2024) ఆప్‌కు ఢిల్లీలో ఒక్క సీటు కూడా దక్కలేదు. కానీ, రాజధాని ప్రాంతాన్ని పరిమిత అధికారాలతో జనరంజకంగా పరిపాలించిన పార్టీగా ఆప్‌ను జనం గుర్తించారు. మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్ అరెస్టయి జైలు జీవితం గడిపిన సింపతీ, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పెట్టుకున్న పొత్తు కూడా ఆప్‌కు ఉపయోగపడలేదు. కొత్త మిత్రపక్షాలైన కాంగ్రెస్, ఆప్ రాజధానిలో ఖాతా తెరవలేకపోయాయి. హర్యానాలో కూడా ఈ పొత్తు ఫలించకపోవడంతో కాంగ్రెస్‌కు అక్కడి మొత్తం పది సీట్లలో ఐదు మాత్రమే దక్కాయి. ఆప్ పోటీచేసిన ఒక్క సీటు కురుక్షేత్రలో ఆ పార్టీకి ఓటమి ఎదురైంది.

ఈ లెక్కన పంజాబ్, హర్యానా, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు ఏ మాత్రం ప్రయోజనకరం కాదనే స్పష్టమైన అవగాహనతోనే హర్యానాలో కాంగ్రెస్ పది సీట్ల వరకు ఇవ్వజూపినా ఆ పార్టీతో పొత్తుకు ఆప్ నిరాకరించింది. కుటుంబ మూలాల రీత్యా సొంత రాష్ట్రమైన హర్యానాలోని మొత్తం 90 సీట్లకు కేజ్రీవాల్ సొంత పార్టీ అభ్యర్థులను నిలబెట్టారు.

> అంతేగాక, కాంగ్రెస్‌తో తెగదెంపులు చేసుకున్నాక తన రాజీనామా నిర్ణయం, మహారాష్ట్ర ఎన్నికలతో పాటే ఢిల్లీ ఎన్నికలు జరిపించాలనే డిమాండ్‌తో ముందుకొచ్చిన కేజ్రీవాల్ మాటలు హస్తం పార్టీకి రుచించలేదు. ఆయన నిర్ణయాన్ని కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఎన్నికల్లో గెలుపుపై హర్యానాలో ఉన్న ధీమా ఢిల్లీలో కాంగ్రెస్‌కు లేదు. ఈ విధంగా ఒకేసారి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను రాజధానిలో మట్టికరిపించడానికి కేజ్రీవాల్ పన్నిన వ్యూహం ఎంతవరకు ఫలిస్తుందో త్వరలోనే తేలిపోతుంది.

ఒకవేళ మహారాష్ట్రతో పాటే కొద్ది వారాల్లో ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు జరిపిస్తే కొత్త సీఎంగా ప్రమాణం చేసే ఆతిశీ మార్లెనా పాలనతో సంబంధం లేకుండా కేజ్రీవాల్ పదేండ్ల పాలనపై ఓటర్లు తీర్పు ఇస్తారనడంలో ఎలాంటి సందేహం లేదు. రాజకీయ కక్షలతో కేంద్ర ప్రభుత్వం తన చెప్పుచేతల్లోని సీబీఐ, ఈడీ వంటి సంస్థలతో పెట్టిన కేసుల ఫలితంగా కొన్ని మాసాల జైలు జీవితం గడిపిన అనేకమంది ప్రాంతీయ పక్షాల నేతలు ప్రజాక్షేత్రంలో విజయం సాధించిన సందర్భాలే ఇప్పుడు అరవింద్ కేజ్రీవాల్‌కు స్ఫూర్తిదాయకం. ■

> ఈ లెక్కన పంజాబ్, హరియానా, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు ఏ మాత్రం ప్రయోజనకరం కాదనే స్పష్టమైన అవగాహనతోనే హర్యానాలో కాంగ్రెస్ పది సీట్ల వరకు ఇవ్వజూపినా ఆ పార్టీతో పొత్తుకు ఆప్ నిరాకరించింది. కుటుంబ మూలాల రీత్యా సొంత రాష్ట్రమైన హర్యానాలోని మొత్తం 90 సీట్లకు కేజ్రీవాల్ సొంత పార్టీ అభ్యర్థులను నిలబెట్టారు.

హైడ్రా.. ఇదో మెదడు లేని చేతనం. ఆకలి తప్ప, ఆలోచన లేని జలచరం. నాడీకణం కమాండ్‌తో కదిలే హైడ్రో జోవా జీవి. మేత వేస్తే రూపం మార్చుకుంటుంది. శత్రువు ఎదురుపడితే దూరంగా పారిపోతుంది. హైదరాబాద్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వదిలిన హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) కూడా ఇవే లక్షణాలతో తడబడుతున్నది. రెండు అడుగులు బలంగా వేసిందో లేదో.. అప్పుడే రూపం మారింది. రోకు తప్పింది. మహా నగరం తూర్పు, పడమర, ఉత్తర దిక్కుల్లోనే హైడ్రా సంచరిస్తుంది. కానీ, దక్షిణ దిక్కు గమనానికెందుకో జంకుతున్నది.

బేగరి కంచెకు హైడ్రా దారి!

వర్ధెల్లి వెంకటేశ్వర్లు

హైడ్రా కమిషనర్ ఐపీఎస్ అధికారి ఏవీ రంగనాథ్ వ్యక్తిత్వం మీద ఎవరికీ అనుమానం లేదు. తను కమిషనర్‌గా ఉన్నాడు కాబట్టే, జనం హైడ్రా గమనం మీద కొంత భరోసాతో ఉన్నరు. ఒక ప్రభుత్వ పాలసీ దాని స్వభావం మీద కాకుండా అధికారి విశ్వసనీయత మీద మనుగడ సాగించటం రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి. హైడ్రాకు కమాండ్ ఉంటేనే కదిలే జీవి. అట్లాగే కానిస్టేబుల్ నుంచి కమిషనర్ వరకు కమాండ్ మీద నడిచేదే పోలీసు వ్యవస్థ. అది పోలీసు ఉద్యోగ ధర్మం. హైడ్రా గమనం మీద రోజురోజుకు నీలినీడలు కమ్ముకుంటున్నాయి. కూల్చివేతల దశలో కాంగ్రెస్ మాజీ కేంద్రమంత్రి పల్లంరాజు ఇల్లు కూలగొట్టింది. హైడ్రా పనితనానికి ఇదే రోల్ మోడల్ అని ప్రకటించింది. ఇది అభినందనీయమే. కానీ, దానికి ఆనుకొనే ఉన్న అదే రాజుగారి రక్త సంబంధీకుల ఇంటిని ఎందుకు పడగొట్టలేదనే అనుయోగం అప్రస్తుతం. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ ట్రైసిటీలో చెరువుల పరిరక్షణ, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, ప్రభుత్వ భూముల దురాక్రమణ అంటూ అవతరించి, ఆటోపం చేస్తున్న హైడ్రా దక్షిణం దిక్కును ఎందుకొదిలేసింది?

మహానగరం త్రయ చెరుగుల హైడ్రా విధ్వంసం జరుగుతుంటే.. నాలుగో దిక్కు నయా జమానా సాగుతున్నది. ఐటీ సిటీ రాయదుర్గంలో ఆక్యుపెన్సీ లేదన్న మెట్రో రైలు, జనమే లేని బేగరి కంచెకు దారులు వెతుకుతున్నది. రీజినల్ రింగు రోడ్లు పంట పొలాల్లో పాములు తిరిగినట్టు అష్ట వంకర్లతో పారాడుతున్నయి. 300 అడుగుల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు.. రేడియల్ రహదారులు.. కనెక్టింగ్ రోడ్లు.. వాటి వెనకాలే వేల ఎకరాల భూములు.. ఒత్తిళ్ల ఒప్పందాల దందా దుమ్ము లేపుతుందట. నాడు అజలాపూర్, ఇర్విన్, వెల్దండ పల్లెల్లో జల్, జమీన్, జంగల్ నినాదంతో గన్ను పట్టి, ప్రజాదర్బార్లు పెట్టి రాజ్ బహుదూర్ల భూములను పంచిన అన్నలే.. ఇవాళ నయీం అనుచరులై బేగరి కంచెల (ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీ) రౌడీ దర్బార్లు పెట్టిండ్రట. నాడు సాగు చేసుకొమ్మని రైతుకు ఇచ్చిన భూములకు నేడు కబ్జా హక్కును రద్దు చేస్తున్నరట. కబ్జా రద్దు పరిచిన భూములకు కూడా అగ్రిమెంట్లు చేస్తున్నరట. అగ్రిమెంట్లు, ఆక్రమణ వెనుక ఎవరున్నారనే మీమాంసను పక్కనపెడితే.. ముళ్లకంచెలో కృత్రిమ రియల్ ప్రకంపనలు జనించటమే హైడ్రా అంతర్గత వ్యూహమా?

> కూడు, గూడు, గుడ్డ కమ్యూనిస్టు సిద్ధాంతం. కూడు దొరికేది వ్యవసాయ భూమిలోనే. కమ్యూనిస్టు కార్యాలయాలు ప్రజా పోరాటాల కేంద్రాలని కామ్రేడ్లు నిత్యం నినదిస్తుంటారు. రాజ్యానిది ఎప్పుడూ బలవంతమే. కాపు కాయాల్సిన బాధ్యత కామ్రేడ్ల మీదుంది.

ఇప్పటి ప్రజా పోరాటాల్లో అతి బలమైనది సొంతింటి కలే. సర్కారు భూముల్లో ఎర్ర జెండాలు పాతమని ఒక్క పిలుపిస్తే.. వేల మంది బీద బిక్కి, బక్క జనాలు లాఠీలకు, తూటాలకు ఎదురుబోతరు. 60 గజాల ఇంటి జాగ కోసం ఆత్ర పడుతరు. అటువంటిది దశాబ్దాలుగా తనువుతో పెనువేసున్న పేదింటికి హైడ్రా రూపంలో ఆపద వచ్చింది. మరో వైపు పల్లె పొలిమేర మీద ట్రిపుల్‌ఆర్ కత్తి వేలాడుతున్నది. దొంగ రాత్రి పంటపొలాల మీద డ్రోన్లు తిరుగుతున్నయి. రాత్రికిరాత్రే హద్దులు గీసిపోతున్నయి. ఏ క్షణం ఊర్ల మీద పడి భూములు లాక్కుంటారోనని రైతాంగం భయపడుతోంది. ఈ విపత్తును అడ్డుకునే శక్తి ఏది? ప్రజా ఉద్యమాలే కదా..! మరి ఇప్పుడా ఆపన్న హస్తం ఏది? అన్న స్థానంలో నిలబడి ఆదుకోవాల్సిన ఉద్యమకారులు, ఎర్రన్నలు ఎందుకు సందేహిస్తున్నరు.

ఎన్ కన్వెన్షన్ కూల్చినప్పుడు శభాష్..! అని జబ్బలు చరిచిన సీపీఐ నారాయణకు మనస్ఫూర్తిగా విప్లవాభివందనాలు. అవినీతి, అక్రమం కూలాల్సిందే. అదే హైడ్రా రెండు బలమైన అడుగులు వేయకముందే గతితప్పి పేదల కొంపల మీదికి మల్లుతుంటే.. ఎదురెందుకు వెళ్లటం లేదు? రోకు తప్పిన హైడ్రా పట్టుమని పది ఫామ్‌హౌస్‌లు కూల్చకముందే వెయ్యి బక్క గూళ్లను చిదిమేసింది. బేగరి కంచెల సెటిల్‌మెంట్లు పెట్టింది. ఇప్పుడు ఉద్యమ గొంతులు ఏకం కావాలని సకల జనులు వాంఛిస్తున్నరు. ■

బీజేపీకి ఆ హక్కు లేదు!

రిజర్వేషన్లకు సంబంధించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలపై మాట్లాడాలని, నిరసన తెలపాలని బీజేపీ నన్ను సంప్రదించింది. ఆ పార్టీకి చెందిన కొందరు నేతలు రెండు రోజుల పాటు నాపై తీవ్రంగా ఒత్తిడి చేశారు. కానీ, వారు చెప్పినట్టు నేను చేయలేదు, చేయబోను కూడా. ఫలానా పని చేయాలంటూ నన్ను ఆదేశించే హక్కు బీజేపీకి లేదు.

- రాజారత్న అంబేద్కర్, బీఆర్ అంబేద్కర్ మునిమనవడు